సాక్షి తిరుపతి

ఆదివారం । 7 । మే । 2023



దివ్య వేదవాణి గ్రంథావిష్కరణ

మర్రి కృష్ణారెడ్డి రచించిన దివ్య వేదవాణి గ్రంథాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ధర్మపురం శైవ మఠాధిపతి ఆవిష్కరించారు. – IIలో



గంగమ్మ హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ గుడిలో శనివారం హుండీ లెక్కించగా రూ.12లక్షలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	34	25
చిత్తూరు	34	25
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	26

న్యూస్‌రీల్

అమ్మవారికి మంగళసూత్రాల విరాళం



మంగళసూత్రాలను అందిస్తున్న దాత ప్రశాంతి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి శ్వేత డైరెక్టర్ ప్రశాంతి రూ.2.10లక్షల విలువైన రెండు బంగారు మంగళసూత్రాలను శనివారం విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, వీఐ రామ్మోహన్, అర్చకుడు బాబు స్వామి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు

– 65 మందికి ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందిస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఉత్తమ పనితీరును కనబరచిన ఆర్టీసీ ఉద్యోగులకు అందజేస్తున్నట్లు డీపీటీఓ చెంగల్‌రెడ్డి అభినందించారు. శనివారం ఈ మేరకు అలిపిరి డిపోలో పనిచేస్తున్న 65 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. డీపీటీఓ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఒక్కసారైనా అవార్డు అందుకునేందుకు ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. 2022–23 ఆర్థిసంవత్సరానికి సంబంధించి ఆర్టీసీ ఆదాయానికి అండగా నిలిచిన వారికి అభినందనలు తెలిపారు. ఈక్రమంలో విద్యుత్ బస్సుల కాంట్రాక్టర్ బుజ్జి విరాళంగా కూలర్‌ను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ హరిబాబు పాల్గొన్నారు.

నాణ్యతాప్రమాణాల మేరకే 'కానుక'



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : జగనన్న విద్యాకానుకను స్టాక్ పాయింట్‌లో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, నాణ్యతాప్రమాణాల మేరకే సామగ్రి ఉండాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. పాఠశాలు ప్రారంభమయ్యే నాటికి పిల్లలకు పూర్తిస్థాయిలో విద్యాకానుక కిట్‌లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈఓ శేఖర్, డీఎల్‌డీఓ సుశీలాదేవి, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మత్స్యశాఖ జిల్లా అధికారి బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసనాయక్

తిరుపతి అర్బన్ : మత్స్యశాఖ జిల్లా అధికారిగా శ్రీనివాసనాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా మత్స్యశాఖ డీడీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై తిరుపతికి వచ్చారు. గత ఏడాది నవంబర్ వరకు శ్రీనివాస్‌నాయక్ జిల్లా మత్స్యశాఖ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఆయన తిరుపతికి రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

పదోతరగతి ఫలితాల్లో తిరుపతి జిల్లా సత్తా చాటింది. 75.70 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే 8వ స్థానం దక్కించుకుంది. ముఖ్యంగా బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించి హవా కొనసాగించారు. జిల్లాలోని ఏడు సర్కారు బడుల్లోని విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ వంద శాతం ఉత్తీర్ణులైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



ఎర్రావారిపాళెం మోడల్ స్కూల్లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పది.. బాలికలే పెన్నిధి!

- పదోతరగతి ఫలితాల్లో జిల్లాకు 8వ స్థానం
- 75.70శాతం ఉత్తీర్ణత
- హవా కొనసాగించిన విద్యార్థినులు

జిల్లా సమాచారం	
పరీక్షకు హాజరైన విద్యార్థినులు	12,529
ఉత్తీర్ణులు	9,837
విద్యార్థులు	13,859
ఉత్తీర్ణులు	10,139

ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత శాతం వివరాలు

యాజమాన్యం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
ఏపీ మోడల్	394	297	75.38
ఏపీఆర్‌ఈఐఎస్	157	144	91.72
ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్	839	693	82.60
ఏపీటీడబ్ల్యూఆర్	456	297	65.13
కేజీబీవీ	164	106	64.63
ఎంజేపీఏపీబీసీఆర్	392	332	84.69
ఎంపీపీ, జెడ్పీ	10,885	6753	62.04
మున్సిపల్	993	581	58.51
ప్రైవేట్ ఎయిడెడ్	783	571	72.92
ఇతర పాఠశాలలు	823	442	53.71

తిరుపతి ఎడ్యుకేషన్ : నూతన జిల్లాల ప్రాతిపదికన పదో తరగతి పరీక్షలను ఈ ఏడాది తొలిసారిగా నిర్వహించారు. మొత్తం 152 కేంద్రాల్లో జరిగి ఈ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో తిరుపతి జిల్లా 8వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా శ్రీకాళహస్తిలోని ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్సీ, చిట్టేడులోని ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ (బాలురు), చెల్లమాంబపురం జెడ్పీ హైస్కూల్ (తమిళ్), చియ్యవరం, పరమాల, బండారుపల్లె, ఉస్తికాయలపెంటలోని జెడ్పీ హైస్కూళ్లు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ వి.శేఖర్ తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో బాలికలే ఎప్పటిలానే ముందంజలో నిలిచారన్నారు. విద్యార్థులు 73.19శాతం ఉత్తీర్ణత సాధించగా, 78.51శాతంతో విద్యార్థినులు సత్తా చాటారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 26,388 మంది బాలబాలికలు పరీక్షకు హాజరుకాగా, 75.70శాతంతో 19,976 మంది పాసైనట్లు వివరించారు. ప్రథమశ్రేణిలో 15,557 మంది, ద్వితీయశ్రేణిలో 3,038 మంది. తృతీయశ్రేణిలో 1,381 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. అలాగే 3,720 మంది విద్యార్థులు, 2,692 మంది విద్యార్థినులు పరీక్ష ఫెయిలైనట్లు తెలిపారు.

నాడు–నేడు పనులు వేగవంతం

పాకాల : నాడు–నేడు పనులను మరింత వేగవంతం చేయాలని, పాఠశాలలు పునఃప్రారంభమయ్యే లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శనివారం మండలంలో మొగరాల, ఓబులశెట్టివారిపల్లె పాఠశాలల్లో సాగుతున్న నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. నిధులు సమృద్ధిగా ఉన్నాయని, పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. డీఈఓ శేఖర్ మాట్లాడుతూ నాడు–నేడు పనులను ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. మంజూరైన నిధులను ఖర్చు చేస్తేనే రివాల్వింగ్ ఫండ్ విడుదల చేస్తామని వెల్లడించారు. జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యం



లబ్ధిదారుకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

- సంక్షేమంతోపాటు విద్య వైద్యానికి పెద్దపీట
- వర్షంలోనూ గడప గడపకూ పర్యటించిన మంత్రి ఆర్కేరోజా

నగరి : పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని జగనన్న చెప్పిన మాట గుర్తుపెట్టుకుని ప్రతి ఒక్కరూ చదువుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె శనివారం నగరి మున్సిపాలిటీ వెస్ట్ సచివాలయం పరిధిలోని చిదంబర నగర్, ఆదం కాలనీ, రాజేశ్వరి థియేటర్ వెనుక వైపుగల వీధుల్లో పర్యటించారు. వర్షంలోనూ గొడుగుపట్టుకు వచ్చిన మంత్రికి అపూర్వ స్వాగతం లభించింది. ప్రతి ఇంటినీ సందర్శించిన మంత్రి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కార చర్యలు చేపడతానని స్థానికులకు తెలియజేశారు. ప్రజలే దేవుళ్లుగా భావించి నాలుగేళ్లుగా ప్రజల కోసమే కష్టపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. పేదరికం పోవాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలంటూ వార్డులోని విద్యార్థులకు ఆమె సూచించారు. అందుకే ప్రభుత్వం విద్యార్థులకు అమ్మఒడి పథకాన్ని, ఇంటర్ మీడియట్ వరకు, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత చదువులు చదువుకునే వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎన్నో రకాల అభివృద్ధి పనులతో రాష్ట్రాన్ని దేశం గర్వించదగ్గ స్థాయిలో నిలిపారన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్న ప్రభుతాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, వార్డు కౌన్సిలర్లు బి.జ్యోతి, ఇంద్రయ్య, బీడీ భాస్కర్, మోహన్‌రాజ్, బిలాల్, నాయకులు సతీష్, రమేష్‌బాబు, సత్యరాజ్, మురుగ, ఆనంద్‌కుమార్, ఎల్లప్పరెడ్డి, తేన్‌మొళి, మున్సిపల్ అధికారులు, సచివాలయ అధికారులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

12 నుంచి అంతర్రాష్ట్ర షటిల్ టోర్నీ

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి రెండురోజులపాటు అంతర్రాష్ట్ర పురుషుల ఓపెన్ షటిల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ వారు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటకకు చెందిన పురుషుల డబుల్స్ జట్లు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. టోర్నీకి పాల్గొనే వారు ఈ నెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో విజేతలకు రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలను బహూకరించనున్నట్లు వివరించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు ఉంటాయని వెల్లడించారు. వివరాలకు 94901 04094, 90109 91236, 63004 41144 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చెవిరెడ్డి సేవలు ప్రశంసనీయం



రక్త పరీక్షల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

- కలెక్టర్ వెంకటరమణారెడ్డి

పాకాల : చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి కొనియాడారు. శనివారం మండలంలోని మొగరాల, వల్లివేడులో చెవిరెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలను ఆయన సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ స్థాయిలో ప్రజలకు అండగా నిలవడం చెవిరెడ్డికే సాధ్యమన్నారు. ఒక్కపైసా ఖర్చు లేకుండా 43 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించే నాయకుడు దొరకడం చంద్రగిరి నియోజకవర్గ వాసుల అదృష్టమని వెల్లడించారు. ఇలాంటి మహోన్నత కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు భాగస్వామ్యం కావాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఉచిత వైద్యపరీక్షలపై గ్రామీణ ప్రాంతాల్లో సైతం అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు సైతం పరీక్షలు చేయించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

పరిపూర్ణం.. పెనుశిల క్షేత్రోత్సవం



తెప్పపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

- శాస్త్రోక్తంగా చక్రస్నానం
- తెప్పలపై విహరించిన దేవదేవేరులు
- ముగిసిన నృసింహుని బ్రహ్మోత్సవాలు

రాపూరు : పెనుశిల శ్రీలక్ష్మీనృసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. చివరి రోజైన శనివారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లతోపాటు సుదర్శన చక్రతాళ్వార్ ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి నందనవనంలోని పుష్కరిణి వద్ద మండపంలోకి వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, స్నపన తిరుమంజనం జరిపించారు. సుగంధ ద్రవ్యాలతో ఉత్సవర్లను అభిషేకించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పుష్కరిణిలో చక్రతాళ్వార్‌కు మూడు పర్యాయాలు పుణ్యస్నానం చేయించారు. స్వామితోపాటు పెద్దసంఖ్యలో భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానమాచరించి తన్మయత్వం చెందారు. ఈ క్రమంలో అలంకార మండపంలో దేవదేవేరులను కొలువుదీర్చారు. వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం గర్భాలయంలో మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. రాత్రి 8గంటలకు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా నృసింహస్వామివారి తెప్పోత్సవానికి శ్రీకారం చుట్టారు. సుగంధ సుమాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన తెప్పలపై స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో విహరించారు. 10 గంటలకు కనులపండువగా అశ్వవాహన సేవ నిర్వహించారు. 11 గంటలకు వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేపట్టారు. బ్రహ్మోత్సవ సంబరాలను పరిసమాప్తం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నుతిరుపాల్‌రెడ్డి, ఉత్సవాల ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, ఈఓ జనార్ధన్‌రెడ్డి, వేదపండితులు రామానుజాచారి, సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి పాల్గొన్నారు.

నేడు గోనుపల్లిలో గ్రామోత్సవం

పెంచలకోన నుంచి ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా బయలుదేరి గోనుపల్లె గిరిజనకాలనీకి చేరుకుంటారు. ప్రత్యేక పూజలు అందుకున్న తర్వాత, రాత్రి 8గంటలకు దేవదేవేరులకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

ఆర్టీసీకి రాబడి

పెంచలకోనకు బ్రహ్మోత్సవాల సందర్భంగా 30 ప్రత్యేక బస్సులు నడిపినట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వివిధ మార్గాల్లో నడిచిన సర్వీసుల ద్వారా మొత్తం రూ.10.5లక్షల రాబడి వచ్చినట్లు వెల్లడించారు.

నేటి నుంచి జిమ్నాస్టిక్స్‌లో ఉచిత శిక్షణ



జిమ్నాస్టిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జిమ్నాస్టిక్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.ప్రవీణ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉచితంగా అందించనున్న శిక్షణను యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8374559557 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పిడుగుపాటుకు 13 గొర్రెలు మృతి


గొర్రె కళేబరాలను తీసుకువస్తున్న కాపరులు

కేవీబీపురం: పిడుగుపాటుకు 13 గొర్రెలు మృత్యువాత పడి, ఇద్దరు కాపరులు గాయపడిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు గుర్రై పెరిందేశం దళితవాడకు చెందిన కళత్తూరు మురుగేష్, మేఘలా అనే వారికి చెందిన 13 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఇదే ఘటనలో మురుగేష్, సెల్వ అనే ఇద్దరు కావరులు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తి ఏరియా అస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాద మృతులకు అశ్రునివాళి

రేణిగుంట : తమిళనాడు రాష్ట్రం కన్నమంగళం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాళహస్తికి చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు దుర్మరణం పాలైన విషయం విధితమే. శనివారం రాత్రి మృతులు దయాసాగర్‌రెడ్డి, కుమారుడు సూర్యతేజరెడ్డి, కోడలు మౌనిక పార్థివ దేహాలు పోస్టుమార్టం అనంతరం పట్టణంలోని నివాసానికి చేరుకున్నాయి. అప్పటికే అక్కడకు చేరుకున్న బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. తీవ్రంగా గాయపడి వేలూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దయాసాగర్‌రెడ్డి సతీమణి మధుమతి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తల్లడిల్లిపోయారు.

'పల్లె'వించిన ఆత్మీయత


మగ్గంతో నూలు ఒడుకుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ఉత్సాహంగా గడప గడపకు మహాపాదయాత్ర
- మోహిత్‌రెడ్డికి అడుగడుగునా జననీరాజనం

భాకరాపేట : చంద్రగిరి నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు మహా పాదయాత్ర శనివారం మండలంలోని చట్టీవారిపాళెం పంచాయతీలో ఉత్సాహంతో సాగింది. మోహిత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. దిగువ, ఎగువ ఈడిగపల్లె, కృష్ణాపురం కాలనీ, బండారువాండ్లపల్లె, ఎలిచెర్లవారిపల్లె, ఎలిచెర్లహరిజనవాడ, పాట్టిగాని తోపు, తొగటపల్లె, బద్దలవారిపల్లె, కృష్ణారెడ్డిగారిపల్లె, ఇరగ్గాలహరిజనవాడ, వంకమద్దివారిపల్లె, మిట్టమీదపల్లె గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ పర్యటించారు. ఈ సందర్భంగా


మహిళలకు అభివాదం చేస్తున్న చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి

మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు చూపిస్తున్న ఆదరణ మరువలేమన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబసభ్యుడిగా భావిస్తుండడం సంతోషంగా ఉందని వెల్లడించారు. జనం గుండెల్లో నిలిచేలా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవలందిస్తున్నారని, ఆయన అడుగుజాడల్లోనే పయనిస్తూ మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. పంచాయతీ పరిధిలో మొత్తం రూ.8.5కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, గృహ నిర్మాణాలను పూర్తి చేయించినట్లు వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు స్వరూప, సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, డివిజన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరెడ్డి, ఉప సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు మహేంద్రరెడ్డి, సచివాలయ కన్వీనర్లు లోకనాథరెడ్డి, బాలసుబ్రమణ్యం, రఘునాథ, మనోహర, స్థానిక నేతలు సిద్ధరామయ్య, శంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాళ్ల పారాణి ఆరకముందే కన్నీటి సుడిలోకి..

- కొండచెరియను ఢీకొట్టి స్కూటర్‌పై పడిన కారు
- భర్త మృతి.. భార్యకు గాయాలు


ఘటనాస్థలంలో గురుప్రసాద్ మృతదేహం

చంద్రగిరి (తిరుపతి రూరల్) : నవ దంపతులు.. వివాహమై 13 రోజులే అయ్యింది.. ఎన్నో ఆశలతో జీవిత పయనం ప్రారంభించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం భర్తను కబళించింది. కాళ్ల పారాణి ఆరకముందే భార్యను కన్నీటి సుడిలోకి నెట్టేసింది. శనివారం భాకరాపేట ఘాట్‌లో తిరుపతి నుంచి వస్తున్న ఓ కారు రోడ్డు పక్కన కొండచెరియను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న స్కూటర్‌పై పడింది. వివరాలు.. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట టీచర్స్ కాలనీకి చెందిన గురుప్రసాద్(21) ఇటీవలే పళ్లిపట్టుకు చెందిన సుగంధితో వివాహమైంది. పిల్లనిచ్చిన మామ సురేంద్ర శనివారం తిరుపతికి రావడంతో ఆయనను చూసేందుకు భార్యను తీసుకుని గురుప్రసాద్ స్కూటర్‌పై బయలుదేరాడు. ఎర్రావారిపాళెం మండలం బోడేవాండ్లపల్లెకు చెందిన నిరంజన్ కారులో తిరుపతి నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఘాట్‌లోకి వచ్చిన తర్వాత నిద్రమత్తు కారణంగా కారును అదుపు చేయలేక పక్కనే ఉన్న కొండ చెరియను ఢీకొన్నాడు. దీంతో కారు ఎదురుగా గురుప్రసాద్ దంపతులు వస్తున్న స్కూటర్‌పై పడింది. ఈ ప్రమాదంలో గురుప్రసాద్‌కు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. భార్య సుగంధికి కాలు విరిగింది. కారు డ్రైవర్ నిరంజన్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,810
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,641
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,300
రిటైల్ వెండి గ్రాము	రూ.80.30

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

తొట్టంబేడు(రేణిగుంట) : మండలంలోని దయనేడు గ్రామంలో గత నెల 28వ తేదీన ఆత్మహత్యకు యత్నించిన శీనయ్య (48) అనే వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. కుటుంబ సమస్యలతో శీనయ్య పురుగుల మందు తాగేశాడు. స్థానికులు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మరణించాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

దివ్య వేదవాణి గ్రంథావిష్కరణ

రేణిగుంట: మర్రి కృష్ణారెడ్డి రచించిన దివ్య వేదవాణి గ్రంథాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ధర్మపురం ఆధీనం శైవ మఠాధిపతి దురుమై ఆవిష్కరించారు. ముక్కంటి ఆలయానికి అంకితమిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్య వేదవాణి గ్రంథంలో రుగ్వేదం, శుక్ల, యజుర్వేదం, కృష్ణ, సామ, అధర్వణ వేదం అన్నింటినీ మిళితం చేసి ఒకే గ్రంథంగా రూపొందించడం విశేషమని ప్రశంసించారు. దేశంలోనే అతిపెద్ద గ్రంథంగా ఇది రికార్డు సృష్టిస్తుందని తెలిపారు. ఈ గ్రంథాన్ని ఎమ్మెల్యే, పీఠాధిపతితోపాటు ఆర్డీఓ రామారావు చేతుల మీదుగా శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. వేదపండితులందరికి ఈ గ్రంథాన్ని అందుబాటులో ఉంచాలని కోరారు.

